క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, ములకపాడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నూతన డాక్టర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం తాజాగా చేపట్టిన రెగ్యులర్ డాక్టర్ల నియామకంలో భాగంగా పర్ణశాల డాక్టర్‌గా రేణుకారెడ్డి, ములకపాడు రెండో డాక్టర్‌గా పుల్లారెడ్డి బాధ్యతలను చేపట్టారు. వైద్యశాల సిబ్బంది వారికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.
చండ్రుగొండ: మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణిగా డాక్టర్ కనకం తనుజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పాల్వంచలో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న వెంకటప్రకాష్ నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు.
అశ్వాపురం: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా డాక్టర్ సంకీర్తన మంగళవారం పీహెచ్‌సీలో బాధ్యతలు చేపట్టారు. వైద్యాధికారి మణికంఠారెడ్డికి డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. వైద్యురాలు సంకీర్తన విలేకరులతో మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ పీహెచ్‌సీ ద్వారా నిరంతరం వైద్య సేవలు అందిస్తామన్నారు.

అసాంఘిక వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

పినపాక: అసాంఘిక వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, చెడు మార్గాల్లో నడవకుండా ఉండాలని డీఎస్పీ రాఘవేంద్రరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వలస ఆదివాసీ గ్రామమైన విప్పలగుంపులో పర్యటించిన ఆయన.. గ్రామస్తులకు బకెట్లు, సోలార్ లైట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అసాంఘిక వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. సీఐ రాజగోపాల్, ఎస్సై టీవీఆర్ సూరి పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

చర్ల: గ్రామపంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సుందరయ్య కాలనీలో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు నిధులు కేటాయించకపోతుండడంతో గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పాలకవర్గాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాలెం చుక్కయ్య, రాంమ్మూర్తి, వీరయ్య, నానయ్య, పాపయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపు సరికాదు

చండ్రుగొండ: పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రభుత్వం నీరుగారుస్తోందని జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి విమర్శించారు. మండలకేంద్రం చండ్రుగొండ పంచాయతీ పాలకవర్గం సాధారణ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా పంచాయతీ నిధులను మళ్లించిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ డి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ వినతి

అశ్వాపురం: మండల కేంద్రంలో వారాంతపు సంత నిర్వహణకు స్థలం ఇప్పించాలని, గ్రామ పంచాయతీ పరిధిలో 30 విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయించాలని మంగళవారం అశ్వాపురం సర్పంచ్ బాణోత్ శారద అశ్వాపురంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధికారుల అనుమతితో గత 13 సంవత్సరాలు ఆర్టీసీ స్థలంలో సంత నిర్వహిస్తున్నామని ఇటీవల ఆర్టీసీ అధికారులు అద్దెను రాతపూర్వకంగా అడగగా నిరాకరించడంతో సమస్య మొదలైందన్నారు. అధికారులతో మాట్లాడి సంతకు స్థలం కేటాయించేలా చేయాలని ఎమ్మెల్యేను సర్పంచ్ కోరారు.

వేతనాలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: రెండు సంవత్సరాలుగా గిరిజన కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం పస్తులుంచుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి ఆరోపించారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని పీఎంహెచ్ పోస్టుమెట్రిక్ హాస్టల్స్ వద్ద పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల బకాయి వేతనాలను విడుదల చేయాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేతనాలు చెల్లించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు నరికంటి నాగరాజు, డి.లక్ష్మీకాంత్, శీలం సత్యవతి, కణితి శారద, శ్రీను, గుండి రాధా, జాడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాదరక్షల వితరణ

దుమ్ముగూడెం: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వైట్ నాగారం పాఠశాలలో 32 మంది విద్యార్థులకు భద్రాచలం పట్టణానికి చెందిన శ్రీ సాధన పబ్లిక్ స్కూల్ యాజమాన్యం రమేష్ బాబు పాదరక్షలు వితరణగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కారంపూడి దశంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెలను హడలెత్తిస్తున్న కోతులు

- గ్రామాల్లో గుంపులుగా సంచారం
- పంటలను పాడు చేస్తున్న వైనం
- వణికిపోతున్న జనం



గ్రామాల్లో గుంపులుగా తిరుగుతున్న కోతులు..

బూర్గంపాడు: మండల ప్రజలను కోతులు హడలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో రోజురోజుకూ కోతుల గుంపులు పెరిగిపోతున్నాయి. ఇళ్లలోంచి బయటకు రావాలంటేనే కోతులతో ప్రజలు భయపడుతున్నారు. చేతుల్లో ఏమీ ఉన్న లాక్కునిపోతున్నాయి. ఏవరైనా ప్రతిఘటిస్తే వారిపై దాడికి పాల్పడి కరుస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఏమాత్రం ఆదమరిచి ఇంటికి తలుపు వేయటం మరిచిపోయారంటే.. ఇక ఆ ఇంటిని చిందరవందర చేస్తున్నాయి. ఇంటి ఖాళీస్థలాల్లో, పెరళ్లలో కూరగాయలు, పూలమొక్కలు పెంచుకునే పరిస్థితులు లేవు. మొక్కలను, కూరగాయలు చెట్లను పీకేసి పాడుచేస్తున్నాయి. ఇక పండ్లచెట్ల పరిస్థితి మరీ దారుణం. పూత, పిందె దశల్లోనే వాటిని పాడుచేస్తున్నాయి. కోతుల తీవ్రతకు ఇళ్లకు ప్రత్యేకంగా ఇనుప మెస్‌లు పెట్టుకోవాల్సిన పరిస్థితులున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి పట్టుకుని తీసుకువచ్చిన కోతులను మండల పరిసరాల్లో వదలటంతో వాటి తీవ్రత మరింతగా పెరుగుతుంది. కిరాణాదుకాణాలు, హోటళ్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ప్రతి దుకాణ దారుడు కోతులు తోలేందుకు ప్రత్యేకంగా ఒక మనిషిని కేటాయించాల్సిన పరిస్థితి ఉంది. గ్రామపంచాయతీలు, అటవీశాఖ అధికారులు కోతులను పారదోలేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలలోనే కాకుండా పంటచేలను కూడా కోతులు వదలటం లేదు. పత్తి కాయలను వలిచి పాడుచేస్తున్నాయి. వరికంకులను పీకిపారేస్తున్నాయి. మినుము, పెసర వంటి అపరాల పంటల పరిస్థితి మరీదారుణంగా మారింది. వేరుశెనగ చేలను పీకి పారేస్తున్నాయి. కేవలం కోతుల కాపలాకే ప్రత్యేకంగా కాపలా మనిషిని పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. చేతిలో కర్ర లేకుండా మనుషులపై దాడికి పాల్పడి గాయపరుస్తున్నాయి. మండలంలో పలువురు కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రులు పాలైన ఘటనలున్నాయి. గ్రామాల నుంచి కోతులను పారదోలేందుకు గ్రామ పంచాయతీలు, అటవీశాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



కోతులతో బాగా ఇబ్బందిపడుతున్నాము. మేము పనిలో ఉన్నప్పుడు అవి ఇళ్లలోకి జొరబడి వస్తువులను, తినుబండరాలను ఎత్తుకుపోతున్నాయి. కోతులను తోలేందుకు ప్రత్యేకంగా ఒక మనిషి ఉండాల్సివస్తుంది. కోతులు పారదోలేందుకు పంచాయతీ చర్యలు తీసుకోవాలి.

– ఎడారి రాంబాబు, హోటల్ నిర్వాహకుడు

కోతులను తరిమేందుకు చర్యలు తీసుకోవాలి



కోతులతో పిల్లలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. బూర్గంపాడులో ఒక నెలలోనే పదిమందిని కోతులు కరిచాయి. చేతుల్లో ఏమీ ఉన్న లాక్కుపోతున్నాయి. కోతులను పట్టి అడవిలో వదిలిపెట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– షేక్ పాషా, పెయింటర్

వరద బాధితులకు ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు

బూర్గంపాడు: గత ఐదు నెలలుగా ఇంటి స్థలాల కోసం వరద బాధితులు, పేదలు కొనసాగిస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 437/1 ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు క్రాస్ ముత్యాలమ్మ గుడి వద్ద కొనసాగుతున్న 143వ రోజు వరద బాధితుల ఆందోళన శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మోరా రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆవునూరి మధు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ వరద బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం 10వేలు, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ చర్యలు చేపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కుంజా కృష్ణ, బండ్ల వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా అధ్యక్షుడు మలికంటి రాము, నాయకులు వైఎస్ రెడ్డి, పొనగంటి వెంకన్న, ఆర్.లక్ష్మి, కుంజ భద్రమ్మ, జీనత్, మంగీలాల్, కృష్ణవేణి, వెంకటమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

నిరభ్యంతర పత్రాలు జారీ చేయాలి



ఐటీడీఏ డీడీ రమాదేవికి సమస్యలను విన్నవిస్తున్న సంఘ ప్రతినిధులు, అభ్యర్థులు

భద్రాచలం: గిరిజన సంక్షేమ విద్యా సంస్థలలో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయులు ఉన్నత చదువులకు వెళ్లడానికి ఇవ్వాల్సిన నిరభ్యంతర పత్రాలను (ఎన్‌ఓసీ) జారీ చేయకుండా ఐటీడీఏ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు, ఉపాధ్యాయదర్శిని సంపాదకుడు మునిగడప రామాచారిలు ఆరోపించారు. మంగళవారం ఐటీడీఏ ఎదుట ఉపాధ్యాయులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఐటీడీఏ డీడీని కలిసి సమస్యలను విన్నవించారు. పత్రాలను జారీ చేయడంలో ఐటీడీఏ అధికారులు సంబంధం లేని కారణాలను చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పైచదువులకు విద్యా సంస్థల్లో అడ్మిషన్ పొందిన అభ్యర్థులు ఫీజులు కట్టారని, ఇప్పుడు ఎన్‌ఓసీ ఇవ్వకపోతే మొత్తం ఫీజు చెల్లించడం లేదా ఒరిజనల్ సర్టిఫికెట్లు తిరిగిపొందలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఐటీడీఏ పీఓ గౌతమ్‌పోట్రు తమ అభ్యర్థనను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ లింక్ తప్పని సరి

గుండాల: ఉపాధిహామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో లింకు చేయించుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ రవితేజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లింకు చేయించుకునేందుకు వెంటనే జాబ్‌కార్డు, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లను స్థానిక గ్రామ పంచాయతీలలో అందించాలని పేర్కొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద నేడు (బుధవారం) ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. భద్రాచలం ఐటీడీఏ సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు హాజరై ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల దాకా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్ పర్యటన

అశ్వారావుపేటరూరల్: జిల్లా కలెక్టర్ అనుదీప్ నేడు (బుధవారం) అశ్వారావుపేటలో పర్యటించనున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, ఎన్‌సీడీ క్లినిక్, రోగుల విశ్రాంతి హాల్‌ను నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభిస్తారని సీహెచ్‌సీ సుపరిటెండెంట్ జయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు కుడా హాజరు అవుతారని అన్నారు.

వెండి పళ్లెం బహూకరణ

చర్ల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయానికి చర్లకు చెందిన మాన్యం పురుషోత్తం–లక్ష్మి దంపతులు మంగళవారం వెండి పళ్లేన్ని అందజేశారు. ఆలయంలో పూజా కార్యక్రమాలకు ఉన్న అవసరతను గుర్తించిన ఈ కుటుంబం వెండి పళ్లేన్ని కొనుగోలు చేసి ఆలయ కమిటీ సభ్యులు చింతా నాగబాబు, పుప్పాల ముత్తయ్య, గాధంశెట్టి శ్రీనులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వీరి కుటుంబం పేరిట పూజారి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

బూర్గంపాడు: మండల పరిధిలోని లక్ష్మీపురం–యాపలగడ్డ గ్రామాల మధ్య మంగళవారం రాత్రి జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. అందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపాడు యాదవబజారుకు చెందిన ప్రభాకర్, చిన్నా అనే యువకులు తమ ద్విచక్ర వాహనంపై వారి గ్రామం నుంచి లక్ష్మీపురం వస్తున్నారు. ఈ క్రమంలో ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఒక్కసారిగా ఢీ కొట్టడంతో వారిరువురరూ రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

ప్రజాప్రతినిధులదే బాధ్యత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటు పడటానికి, సరైన పద్ధతిలో నిధులు రాకపోవడానికి ప్రజా ప్రతినిధులే బాధ్యత వహించాలని సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి నిధులను తీసుకురావడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. నిధులు సాధించేందుకు, స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, దబ్బుకట్ల లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, మర్లపాటి రేణుక, వంకా రాములు, వంశీ, చంద్రయ్య, గంగ, నరేష్, మచ్చా రామారావు, చంటి, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీ బాయి పూలే జయంతి

సావిత్రీ బాయి పూలే 192వ జయంతి సందర్భంగా మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు, పలు స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంఘాల అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలకు విద్యను అందించడానికి మొదటి పాఠశాలను స్థాపించిన సంఘ సంస్కర్త అని పలువురు వక్తలు కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



చండ్రుగొండ: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పూలే జయంతి వేడుకలు..



చర్ల: విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న గ్రామీణ వైద్యులు



భద్రాచలంటౌన్: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు



అశ్వారావుపేటరూరల్: సావిత్రీబాయి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీటీసీ, బీసీ నాయకులు



భద్రాచలంఅర్బన్: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహిళా సంక్షేమానికి పెద్దపీట



అశ్వాపురం: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం: మహిళా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం తహసీల్దార్ సురేష్‌కుమార్ అధ్యక్షతన 43 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు సుమారు రూ.43 లక్షల రూపాయల చెక్కులను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ వరప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, అశ్వాపురం సర్పంచ్ బాణోత్ శారద, సర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, కోడి కృష్ణవేణి, వెంకటరమణ, పాయం భద్రయ్య, సున్నం రాంబాబు, కల్లూరి లక్ష్మీనారాయణ, బట్టా సత్యనారాయణ, తాటి సుజాత, ఎంపీటీసీలు తాటి పూజిత, ఏనిక రవి, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రేగాకు సన్మానం..
మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ చాంబర్‌లో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ ఆధ్వర్యంలో ఎంపీడీఓ వరప్రసాద్, కార్యాలయం సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ, ఎంపీడీఓ, సిబ్బంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ
మణుగూరురూరల్: స్థానిక క్యాంప్ కార్యాలయంలో పురగిరి క్షత్రియ పెరిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రేగా కాంతారావుకు పెరిక సంఘం నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మణుగూరు మున్సిపాలిటీలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాలో రేగా పర్యటించారు. అలాగే మండల కేంద్రంలో రాయల్ సీడ్స్ వారి నూతన సంవత్సర క్యాలెండర్లను, డైరీలను ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటిసి పోశం నర్సింహారావు, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అడపా అప్పారావు, మండల అధ్యక్షులు ముత్యంబాబు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, పెరిక సంఘం నాయకులు,రాయల్ సీడ్స్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎంతో బోధన సులభతరం

తొలిమెట్టు బోధనాభ్యాసన ఉపకరణాల ప్రదర్శన (టీఎల్ఎం) మంగళవారం కొనసాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు అతిథులుగా పాల్గొని మెళాలను ప్రారంభించారు. తెలుగు, గణితం, సోషల్, సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన బోధన సామగ్రిని ఉపాధ్యాయులు ప్రదర్శించగా.. వాటిని అతిథులు తిలకించారు. ఉత్తమ టీఎల్ఎం తయారు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమాల్లో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: బోధనోపకరణాలను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు



కరకగూడెం: టీఎల్ఎం మేళాను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేగా కాళిక



చర్ల: మేళాను పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.భరణిబాబు

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

దుమ్ముగూడెం: పేదప్రజల వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందవచ్చునని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పర్ణశాల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ సత్యనారాయణకు సీఎం సహాయనిధి రూ.12వేలు విప్ రేగాకాంతారావు సిఫారసుతో మంజూరు కాగా ఆ చెక్కును లబ్ధిదారునికి పంపిణీ చేశారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, అధికారప్రతినిధి జానీపాషా, ఉపాధ్యక్షుడు తునికి కామేశ్వర రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోతుకూరి శ్రీకాంత్, పర్ణశాల గ్రామ కమిటీ అధ్యక్షుడు గోసంగి.కిరణ్,కంటెం.నారాయణ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



భద్రాచలంటౌన్: ఎస్టీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య



అశ్వారావుపేట: ప్రెస్‌క్లబ్ క్యాలెండర్ల ఆవిష్కరణలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

కరకగూడెం: ఆదివాసీ టీచర్ అసోసియేషన్ (ఏటీఏ) తెలంగాణ రాష్ట్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను కరకగూడెం ఎంపీపీ రేగా కాళిక మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మలకం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి పి.మోహన్‌రావు, కరకగూడెం జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులా, స్థానిక సర్పంచ్ ఊకే రామనాథం, హెచ్ఎంలు రాజా, సరిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎస్టీఎఫ్ టీఎస్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని మెరుగైన విద్య ప్రమాణాలు సాధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐనంపూడి జపాన్‌రావు, జిల్లా అధ్యక్షుడు కోండ్రు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ 2023 క్యాలెండర్లను గుండాల, ఆళ్లపల్లి ఎంపీపీలు ముక్తి సత్యం, కొండ్రు మంజుభార్గవిలు మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు బాలు, కాంతారావు, కిషన్, మోహన్‌రావు, రమేష్, శారద, విజయ్, రఘుపతి, నారాయణమ్మ, బొర్రయ్య, రాజు, కమల, లాలరాజు, ప్రేమ్‌సింగ్, చాట్ల శ్రీనివాసరావు, భావ్‌సింగ్,వసంత, పూర్ణ, రాంబాబు,బిక్షమయ్య, ఆళ్లపల్లి మండల పీఆర్‌టీయూ నాయకులు హీరాలాల్, కిషన్, మోహన్‌బాబు, ప్రభాకర్, లక్ష్మణ్, వీరన్న, పాష, సురేష్, శ్రీనివాస్, బాలాజీ, భాస్కర్, స్వర్ణ, సువర్ణ, కవీందర్, రమేష్, చెన్నేశ్వరావు, ఈర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల: ఆదివాసీ టీచర్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, వాల్ స్టిక్కర్లు, పాకెట్ డైరీలను మంగళవారం మండల విద్యాశాఖాధికారి జుంకీలాల్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎల్ఎఫ్ఎన్ నోడల్ ఆఫీసర్ ఏవీ రామారావు, ఆదివాసీ టీచర్స్ అసోసియోషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామారావు, టి.లక్ష్మీపతి, రాష్ట్ర నాయకులు బి.సత్యనారాయణ, ఏ.శ్రీనివాసరావు, ఎస్.వీరాస్వామి, డి.వెంకట్రావు, కె.చిట్టిబాబు, వి.వెంకట్రావు, ఎస్.శ్యాంకుమార్, ఎస్.శేషు, పి.మురళీ, కె.మురళీమోహన్, ఎం.రాజ్‌కుమార్, పి.అరుణ, ప్రసాద్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం
అశ్వారావుపేటరూరల్: ఎంతోకాలంగా పాత్రికేయులకు కేటాయించాల్సిన ఇళ్ల స్థలాల సమస్యను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో మంగళవారం ఆయన చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి పాత్రికేయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు కేటాయించేందుకు ప్రభుత్వ స్థలాన్ని మండలాల వారిగా గుర్తించాలని ఆయా తహసీల్దార్‌లను ఆదేశించినట్లు చెప్పారు. కొత్త ఏడాదిలో అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ బాధ్యులు హరీష్, నాగబాబు, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి రాజమోహన్‌రెడ్డి, తాడేపల్లి రవి, సత్యవరపు సంపూర్ణ, సంకా ప్రసాద్ పాల్గొన్నారు.